క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని ముంబోజిపేట గ్రామానికి చెందిన మంజ దాసోదికి శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ రూ. 60వేలు చెక్కును అందజేశారు. యూత్ అధ్యక్షుడు రాజు, నగేష్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాణాల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో శనివారం బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాణాల లక్ష్మారెడ్డి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ప్రతీ గ్రామంలో బీజేపీ సభ్యత్వాలు చేయించాలన్నారు. తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు విఠల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు దత్తురాం తదితరులున్నారు.

మొరం అక్రమ తవ్వకాలను నిలిపేయాలి



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిపాలిటీ శివారులోని పందిరేసే కుచ్చ నుంచి అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నారని గ్రామస్తులు ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ మహేందర్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. గ్రామ శివారులోని కుంటలో రాత్రి సమయంలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఫిర్యాదు చేశారు. పందిరేసే కుచ్చకు హద్దులు ఏర్పాటు చేసి కుంట నుంచి అక్రమంగా మొరం తవ్వకాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు.

యువజనోత్సవాల్లో ఎల్లారెడ్డి విద్యార్థుల ప్రతిభ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మోడల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు జిల్లా యువజన ఉత్సవాల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా యువజనోత్సవాల్లో కళాశాలకు చెందిన విద్యార్థులు ఫోక్ సాంగ్స్, డ్యాన్స్‌లతో పాటు, స్పీచ్‌లో కళాశాలకు చెందిన విద్యార్థులు కృప, హసీన్, మిష్కత్‌లు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి సెకండ్ ప్రైజ్ గెలుపొందినట్లు వారు తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శనివారం బాలల పరిరక్షణ ప్రతినిధులు విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు, బాల కార్మికులు, డ్రాపౌట్ నివారణ, బాలలపై లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో 1098కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రతినిధులు మోహన్‌నాయక్, సూర్యప్రకాష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ మాసోత్సవాలు



రామారెడ్డి : పోషణ మాసంను పురస్కరించుకొని మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గర్భవతులు బాలింతలు చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్త ఇందిర, అంగన్‌వాడీ ఆయాలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చదువులు సాగేదెలా?

- బాలికల ఉన్నత పాఠశాలలో గదుల్లేక ఇబ్బంది
- ఐదు తరగతులకు నాలుగే గదులు



పాఠశాల ఆవరణలో ఉన్న శిథిలాలు



రాజంపేట : మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సరిపడా గదుల్లే విద్యాబోధన ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం ఈ పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సుమారు 140 మంది విద్యార్థులతో ఈ పాఠశాల కొనసాగుతుంది. విద్యాబోధనకు 4 గదులు మాత్రమే ఉండడంతో అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారింది. పాఠశాలకు నాలుగు గదుల నిర్మాణం మంజూరు కావడంతో శిథిలావస్థలో ఉన్న పాత భవనంలోని నాలుగు గదులను కూల్చి వేశారు. వీటిలో ఒక గది ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నది.

నిధులు మంజూరైనా..

గతంలో ఈ పాఠశాలకు నాలుగు గదుల నిర్మాణం, డైనింగ్ హాల్ కిచెన్ షెడ్ల నిర్మాణాల కోసం గత ప్రభుత్వం మన ఊరు మనబడి కింద రూ. 58 లక్షలు మంజూరు చేసింది. ఎలక్షన్ కోడ్ రావడంతో ఈ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో భూమి పూజ మాత్రమే జరిగింది. పాఠశాలకు అదనపు గదులతో పాటు ఒక సైన్స్ ల్యాబ్, లైబ్రరీ గదులు తప్పనిసరిగా ఉండాలని విద్యార్థులు కోరుతున్నారు. ప్రభుత్వం ఈ నూతన గదుల నిర్మాణానికి ఎప్పుడు అడుగులు వేస్తుందోనని వేచి చూస్తున్నారు.

శిథిలాలు అలాగే..

పురాతన శిథిల భవనాన్ని కూల్చివేసిన శిథిలాలు పాఠశాల ప్రాంగణంలో అలాగే ఉండడంతో విషపురుగులు తిరుగుతున్నాయని విద్యార్థులు బయపడుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు స్పందించి శిథిలాలను తొలగించాలని కోరుతున్నారు.

ఇబ్బందిగా మారింది



గదుల కొరత వల్ల విద్యార్థులకు పాఠాలు బోధించాలంటే ఇబ్బందికరంగా మారింది. కొన్ని సందర్భాల్లో విద్యార్థులకు బయట బోధించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రభుత్వం చొరవ చూపి పాఠశాలకు త్వరగా అదనపు గదులు నిర్మాణం చేపడితే బాగుంటుంది.

– విజయలక్ష్మి, హెచ్ఎం

వరండాల్లో బోధిస్తున్నారు



నేను పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాను. టీచర్లు కొన్ని సందర్భాల్లో బయట వరండాలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల గదుల్లేక అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. మా పాఠశాలకు అదనపు గదులు నిర్మాణాలు చేపట్టాలని కోరుకుంటున్నాం.

– అంకిత, విద్యార్థిని

ఓటరు జాబితా ప్రదర్శన



లింగంపేటలో మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో నరేశ్

పంచాయతీ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను ఆయా జీపీల్లో అధికారులు శనివారం ప్రదర్శించారు. కొత్తవారు ఎవరైనా ఉంటే ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బీబీపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో..



నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో..



దోమకొండలోని ఎంపీడీవో కార్యాలయంలో..



ఎల్లారెడ్డిలో ఆర్డీవో మన్నె ప్రభాకర్, ఎంపీడీవో లక్ష్మి ఆధ్వర్యంలో..

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు పాలాభిషేం, జలాభిషేకం చేశారు. భక్తులు వెంకటేశ్వరుని విగ్రహాన్ని తాంబూలంలో ఉంచి శావతీశారు.

ఏకగ్రీవంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఎన్నిక



పెద్దకొడప్‌గల్ (జుక్కల్) : ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘంలో ఏకగ్రీవంగా ఎన్నికైన ఉపాధ్యాయలను ఘనంగా సన్మానించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలు నిర్వహించారు. మండల అధ్యక్షులుగా ఎర్ర లింగం, ప్రధాన కార్యదర్శిగా నాగనాథ్, కోశాధికారిగా కాంత్రి కుమార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గోపాల్ సింగ్ ఉపాధ్యక్షులుగా లక్ష్మణ్,మహిళ కార్యదర్శిగా స్రవంతిని ఎన్నుకున్నారు.

సీఐకి..



బాన్సువాడ : బాన్సువాడ టౌన్ సీఐ మండల అశోక్‌కు శనివారం బీసీ విద్యార్థి సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. ఇటీవల నిర్మల్‌ను బాన్సువా డకు బదిలీపై వచ్చిన సీఐని కలిసి శాలువతో సన్మా నించారు. శాంతి భద్రతలకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీఐ సూచించారు. బీసీ విద్యార్థి సంఘం నేతలు నిఖిల్‌గౌడ్, దత్తు తదితరులున్నారు.

ధీర వనిత చాకలి ఐలమ్మ



మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్) : దొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన ధీరవనిత చాకలి ఐలమ్మ మన అందరికీ స్ఫూర్తిదాయకమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐలమ్మ త్యాగానికి ప్రతిఫలంగా మహిళా యూనివర్సిటీకి సీఎం రేవంత్‌రెడ్డి ఐలమ్మ పేరు పెట్టారన్నారు. బీఆర్ఎస్ పార్టీ రజకుల ఓట్లను దండుకొని వారిని అన్నివిధాలుగా అణగదొక్కిందన్నారు. రజకుల పిల్లల ఉన్నత చదువులకు తనవంతుగా సాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, మనోజ్ పటేల్, ప్రజా పండరి, ఆకాష్, నాగభూషణం గౌడ్, లోక్యానాయక్, రజక సంఘం మండల అధ్యక్షుడు చాకలి గంగారాం తదితరులున్నారు.

ఆక్యుప్రెషర్ చికిత్స శిబిరం ప్రారంభం



బాన్సువాడ : బీర్కూర్ ఆర్యవైశ్య సంఘం భవనంలో శనివారం లయన్స్ క్లబ్ బీర్కూర్ ఆధ్వర్యంలో ఆక్యుప్రెషర్, మాగ్నేటిక్, వైబ్రేషన్ చికిత్స శిబిరం ప్రారంభించారు. ఈ శిబిరం వారం రోజుల పాటు కొనసాగుతుందని ఎంపీపీ రఘు సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు గాలయ్య, శ్రీనివాస్, మేకల విఠల్, సంతోష్, రషీద్ తదితరులున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి



నాగిరెడ్డిపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించేలా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కాంగ్రెస్ నాగిరెడ్డిపేట మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ సూచించా రు. మండలంలోని మసాన్ పల్లి, ధర్మారెడ్డి, క న్నారెడ్డి, రాఘువపల్లి, అచ్చాయ పల్లి, లింగంపల్లి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి దివిటి కిష్టయ్య పాల్గొన్నారు.



ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది..

ఆకాశంపై ఎవరో ఎర్రటి రంగులు వొలకబోసినట్టుందీ చిత్రం.. ఉదయమే ప్రకృతి ప్రేమికులను ఈ దృశ్యం ఎంతో ఆకట్టుకుంది. శనివారం వేకువజామున సూర్యోదయ సమయంలో మండలంలోని పెద్ద ఎక్లార గేట్ వద్ద ఆకాశం ఇలా ఏర్రగా కనిపించింది. - మద్నూర్

రైతులందరి రుణాలు మాఫీచేయాలి



తాడ్వాయిలో మాట్లాడుతున్న చైర్మన్ కపిల్‌రెడ్డి



రాజంపేట సొసైటీలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకుల్లో తీసుకున్న రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని సింగిల్‌విండో సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సింగిల్ విండో కార్యాలయంలో శనివారం సింగిల్‌విండోచైర్మన్ నల్లవెల్లి కపిల్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. డైరెక్టర్లు శ్యాంరావు, రాజిరెడ్డి, నర్సింలు, రమణారెడ్డి, కార్యదర్శి నర్సింలు న్నారు.

రాజంపేట : రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని కోరుతూ రాజంపేట సొసైటీ మహాజన సభలో తీర్మానిచ్చారు. శనివారం రాజంపేట సొసైటీ చైర్మన్ నల్లవెల్లి అశోక్ ఆధ్వర్యంలో మహాజన సభ నిర్వహించారు. సీఈవో వెంకటేశ్వర శర్మ, డైరెక్టర్లు బాలయ్య, శ్రీరామ్ సురేష్, భాగయ్య, శ్రీరామ్, పటేల్ సాయిబాబా, శ్రీను తదితరులున్నారు.

గాంధారి(ఎల్లారెడ్డి) : రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలని చైర్మన్ సాయికుమార్ కోరారు. చైర్మన్ అధ్యక్షతన శనివారం విండో కార్యాలయంలో మహాజన సభ నిర్వహించారు. విండో కార్యదర్శి సాయిలు, వైస్ చైర్మన్ ఉద్దల్ సింగ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : రైతులందరికీ రూ. 2 లక్షల వరకు రుణ మాఫీని వర్తింప చేయాలని అచ్చంపేట సొసైటీ చైర్మన్ కయ్యుం నర్సింహారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అచ్చంపేటలో చైర్మన్ నర్సింహారెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. వైస్ చైర్మన్ గుమస్తా శ్రీనివాస్, నాయకులు దుర్గారెడ్డి, రమేష్‌గౌడ్, సత్యనారాయణ తదితరులున్నారు.

బాన్సువాడ : ఎలాంటి నిబంధనలు విధించకుండా రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు తీర్మానించారు. శనివారం బాన్సువాడ సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్ కృష్ణారెడ్డి అధ్యక్షతనలో మహాజన సభ నిర్వహించారు. షరతుల్లేకుండా రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని వారు తీర్మానించారు. వడ్లు ఆరబెట్టుకునేందుకు సలహాదారు పోచారం రూ.10 లక్షలు మంజురు చేస్తామన్నారన్నారు. కార్యదర్శి నారాయణ రెడ్డి, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, రైతులు ఉన్నారు.



బాన్సువాడలో..



గాంధారిలో..



అచ్చంపేటలో..

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



జిల్లా కేంద్రంలో భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు ఘననివాళులు అర్పించారు. దేశవిముక్తి కోసం ఆయన చేసిన పోరాటాలను పలువురు మననం చేసుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



జిల్లా కేంద్రంలో నివాళులు అర్పిస్తున్న బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు



బీర్కూర్‌లో..



భిక్కనూరులో..



ఘన్‌పూర్‌లో..

కుక్కలకు వ్యాక్సిన్లు



ఎల్లారెడ్డిలో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యుడు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి పశువుల ఆస్పత్రిలో శనివారం కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు వేసినట్లు వైద్యులు రవికుమార్ తెలిపారు. ప్రపంచ రేబీస్ దినోత్సవంలో భాగంగా కుక్కలకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్లు వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.



తాడ్వాయి మండల కేంద్రంలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో శనివారం ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబీస్ నిరోధక టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రమేశ్, సిబ్బంది పోచయ్య, ప్రేమ్ సింగ్, కొండల్‌రెడ్డి, గంగారాం, బాలచంద్రం, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల హక్కులు, పోషణపై ర్యాలీ



కామారెడ్డిలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీవో

కామారెడ్డి క్రైం : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వయోవృద్ధుల హక్కులు, పోషణపై శనివారం చేపట్టిన ర్యాలీని కామారెడ్డి ఆర్డీవో రంగనాథ రావు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ జరిగింది. వయోవృద్ధుల ఆరోగ్యవంతమైన జీవితం కోసం నడక అవసరమన్నారు. గుండె ఆరోగ్యానికి, రక్త పోటును అదుపులో ఉండటానికి, ఒత్తిడి తగ్గించడానికి, మెదడు చురుకుదనానికి నడక మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ సిటిజెన్స్ ఫోరం అధ్యక్షుడు పున్న రాజేశ్వర్, డీడబ్ల్యూవో బావయ్య, ఇండియన్ రెడ్ క్రాస్ చైర్మన్ రాజన్న, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఉన్నారు.

సంక్షిప్తం

పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు



భిక్కనూరు : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో శనివారం వీధి దీపాలు పట్టపగలు వెలిగాయి. శుక్రవారం రాత్రి వెలిగిన వీధి దీపాలను శనివారం వేకువ జామున స్విచ్ఆఫ్ చేయకపోవడంతో పగలంతా వెలుగుతూనే ఉన్నాయి. ఈ విషయమై పలువురు జీపీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు.

విద్యార్థి కుటుంబానికి చేయూత..

మాచారెడ్డి : పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విజయ్ 3 రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు శనివారం పాఠశాల టీచర్లు రూ 20వేలు, గ్రామస్తులు రూ. 10వేలను అదే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మృతుడి సోదరి అమూల్య పేరుపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు.



పంటపొలాల పరిశీలన



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్ శివారులోని వరి పంటపొలాలను శనివారం క్లస్టర్ ఏఈవో మధుసూదర్ పరిశీలించారు. సదరు పంటపొలాలపై ఆశించిన తెగుళ్ల నివారణకు పిచికారి చేయాల్సిన రసాయన మందులను రైతులకు వివరించారు. స్థానిక నాయకుడు సాయాగౌడ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని అచ్చంపేట గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శనివారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో బలరాం, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.